అగ్రిగోల్డ్ డిపాజిట్లను అందజేయాలి

దీక్షా శిబిరంలో సీపీఐ నాయకులు చాపర

విశాలాంధ్ర-పలాస : అగ్రిగోల్డ్ బాధితులకు సత్వరమే ప్రభుత్వం న్యాయం చేయాలని, వారు కట్టిన డిపాజిట్లను అందజేయాలని, సిపిఐ నాయకులు చాపర సుందరలాల్, చాపర వేణుగోపాల్‌లు అన్నారు. ఆదివారం కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద అగ్రి గోల్డ్ బాధితుల సత్యగ్రాహ దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా అగ్రి గోల్డ్ బాధితుల అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఎం.జయసింహ, రాష్ట్ర మహిళా కార్యదర్శి ఆరేలమ్మలు మాట్లాడుతూ పిల్లల చదువులకు ఉపయోగ పడతాయని కొందరు ఆడపిల్లలకు పెళ్లికి సహాయం పడతుందని, మరికొందరు అనారోగ్య పరిస్థితుల్లో ఆదుకుంటాయని, ఇంకొందరు అదనపు వడ్డీ వస్తుందని ఆశాతో లక్షాలాది మంది మహిళలు పొదుపుకు దగ్గర మార్గంగా భావించిన నిరుపేద శ్రామిక ప్రజలు విశ్రాంత ఉద్యోగులు దాచుకున్న సొమ్మును కొల్లగొట్టి మోసానికి పాల్పడిన అగ్రిగోల్డ్ కంపెనీ నుంచి డబ్బులు వసూలు చేసి బాధితులకు ఇప్పించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి జగన్ మాటలు నమ్మి ఓట్లు వేసి గెలిపించిన లక్షాది మంది అగ్రిగోల్డ్ బాధితుల ఆక్రందనలు ప్రభుత్వానికి వినిపించడం లేదా అని ప్రశ్నించారు. మాట తప్పను మడమ తిప్పను అన్న ముఖ్యమంత్రి జగన్ అగ్రిగోల్డ్ అన్యాయం విషయంలో మౌనం వహించారని ఆవేదన వ్యక్తం చేశారు. పేదల సంక్షేమ పథకాల కోసం 2.5 లక్షల కోట్ల రూపాయలు బటన్ నొక్కి ఉచితంగా అందిస్తున్న ముఖ్యమంత్రికి అగ్రిగోల్డ్ కంపెనీకి ఉన్న సుమారు 30వేల కోట్ల ఆస్తులు స్వాధీనం చేసుకొని ప్రభుత్వం చేతులో ఉన్న బాధితుల డిపాజిట్లు ఇప్పించడంలో కాలాయాపన చేయడం అవసరమా అని ప్రశ్నించారు. అధికారం చేపట్టిన వారం రోజుల్లో 1183 కోట్లు విడుదల చేసి 14 లక్షల మందికి 20వేల రూపాయల లోపు పొదుపు చేసుకున్న వారందరికి పూర్తిగా న్యాయం చేస్తామని, ప్రతిపక్ష నాయకుని హోదాలో ఇచ్చిన హామీని మరిచిపోవడం ముఖ్యమంత్రికి తగదని అన్నారు. మృతి చెందిన బాధిత కుటుంబాలకు నాటి ప్రభుత్వం 5 లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియా ఇస్తే తాను అధికారంలోకి వచ్చిన వెంటనే పది లక్షల రూపాయలు అందజేస్తామని ప్రకటించిన ముఖ్యమంత్రి మరిచిపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. నాలుగున్నరేళ్ల వైసీపీ పాలనలో అగ్రిగోల్డ్ విషయమై అరకొర చర్యలు తప్పా పూర్తిస్థాయిలో పట్టించుకోకపోవడం దారుణమని అన్నారు. కార్యక్రమంలో పలాస నియోజకవర్గం అధ్యక్ష, కార్యదర్శులు రమేష్ పాత్రో, శ్రీనివాస పాత్రో, వామపక్ష నాయకులు వంకల మాధవరావు, దున్న శ్రీనివాస్, తెప్పల అజయ్‌కుమార్‌లతో పాటు ఏజెంట్లు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయకపోవడం అన్యాయం

కాంగ్రెస్ నాయకులు డా.జీవితేశ్వరరావు

విశాలాంధ్ర-పలాస : వైసీపీ ప్రభుత్వం ఏర్పడి సుమారు ఐదేళ్లు కావస్తున్నా అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలను ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి పట్టించుకోకపోవడం దారుణమని. బాధితులకు న్యాయం చేయకపోవడం కూడా అన్యాయమని పలాస నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు డాక్టర్ దువ్వాడ జీవితేశ్వరరావు అన్నారు. ఆదివారం గాంధీ విగ్రహం వద్ద సత్యగ్రాహ దీక్షలు చేపట్టిన బాధితులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న అగ్రిగోల్డ్ ఆస్తుల నుంచి వారికి రావాల్సిన డబ్బులు న్యాయబద్ధంగా అగ్రిగోల్డ్ బాధితులు అడుగుతున్నారని, ప్రభుత్వ ఖజానా నుంచి గాని, ప్రపంచ బ్యాంక్ వద్ద రుణం తెచ్చి ఇవ్వాలని అడగటం లేదని అన్నారు. తాము చెల్లించిన డబ్బులు ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న అగ్రిగోల్డ్ ఆస్తుల నుంచి మాత్రమే అడుగుతున్నారని, ఇది ఎంతో న్యాయసమ్మతమైన డిమాండ్ అని అన్నారు. 10వేలు, 20వేలు కట్టిన బాధితులకే న్యాయం జరగలేదని, 50వేల నుంచి లక్షల్లో కట్టిన వారికి ఇంకెమి న్యాయం జరుగుతుందని ప్రశ్నించారు. తమ డబ్బు తమకు వస్తుందని తెలిసినా ప్రభుత్వం ఇచ్చిన హామీలకు బాధితుల సంఘం ముఖ్యమంత్రి జగన్‌కు పాలాభిషేకాలు చేశారు గాని ఈనాటికి కనీసం పాల డబ్బు అయినా బాధితులకు అందలేదని ఎద్దేవా చేశారు. ఎన్నికల ముందు ఇలాంటి సమస్యలను పరిష్కారం చేసి ప్రజల మన్నలను ప్రభుత్వం పొందాలని సూచించారు. అగ్రిగోల్డ్ బాధితుల ఆక్రందనలను కాంగ్రెస్ పార్టీ తరుపున రాష్ట్ర కాంగ్రెస్ పార్టీకి, తెలంగాణ, కర్ణాటక ప్రభుత్వాలకు విన్నవిస్తామని బాధితుల తరుపున హామీ ఇచ్చారు.

రైతులను, వ్యవసాయ కూలీలను ఆదుకోవాలి

విశాలాంధ్ర-మందస : మిచౌంగ్ తుఫాన్ ప్రభావిత ప్రాంతాల బాధితులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని, ప్రతి కుటుంబానికి 30వేల రూపాయలు ఆర్థిక సహాయం ఇవ్వాలని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏ.ఐ.కె.ఎం.ఎస్) రాష్ట్ర కమిటీ సహాయ కార్యదర్శి తాండ్ర ప్రకాశరావు, శ్రీకాకుళం జిల్లా కమిటీ నాయకులు గొరకల బాలక్రిష్ణలు డిమాండ్ చేశారు. ఆదివారం హరిపురం మార్పు గ్రంథాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రతీ ఏడాది రాష్ట్రంలో అతివృష్టి, అనావృష్టి సంభవించి రైతాంగాన్ని తీవ్రంగా దెబ్బ తీస్తున్నాయని, పరిస్థితులను ముందే అంచనా వేసి సరైన చర్యలు తీసుకొని రైతాంగాన్ని ఆదుకొనేందుకు పాలకులు పూనుకోవడం లేదని వారు విమర్శించారు. రాష్ట్రంలో అనేక చోట్ల వరి కోతలు ప్రారంభమై ధాన్యం చేతికి వచ్చినా ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోకపోవడం వలన ధాన్యం పొలాల్లో ఉండిపోయి తుఫాన్‌కి నీట మునిగి పోయాయన్నారు. వరితో పాటు పత్తి, మొక్కజొన్న, అరటి, కొబ్బరి, మిరప పొగా తదితర పంటలు కూడా నష్టం సంభవించిందన్నారు. కానీ వీరిని ఆదుకొనేందుకు పాలకులు సరైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేసి తగిన నిధులను కేటాయించడం లేదని విమర్శించారు. తీవ్రంగా నష్టపోయిన రైతాంగాన్ని, ప్రజలను ఆదుకోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి 5 లక్షల కోట్ల రూపాయలు విడుదల చేయాలని కోరారు. నష్టపోయిన రైతాంగానికి, కౌలు రైతులతో సహా ప్రతీ పంటకు తక్షణ సహాయంగా ఎకరానికి 30వేల రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని, రైతుల రుణాలను మాఫీ చేయాలని, తిరిగి పంటలు వేయడానికి విత్తనాలు, ఎరువులు ఉచితంగా సరఫరా చేయాలని కోరారు. తడిసిన, రంగుమారిన ధాన్యాన్ని పూర్తిగా ప్రభుత్వమే కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. క్వింటా ధాన్యానికి 3500 రూపాయలు చెల్లించాలని, తుఫాన్ ప్రాంతాల్లో తక్షణ సహాయం కింద 5వేలు పంపిణీ చేయాలని, ప్రజలకు ఉచితంగా బియ్యం, పప్పులు, నిత్యవసర సరుకులను అందించాలని కోరారు.

సమస్యలపై అధికారులు దృష్టి సారించాలి

జిల్లా అధ్యక్షుడు పి.మణిప్రభ

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ : రాష్ట్రంలో టైపిస్టుల సమస్యలపై అధికారులు దృష్టి సారించాలని జిల్లా అధ్యక్షుడు పి.మణిప్రభ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టైపిస్ట్ మరియు స్టేనోగ్రఫర్ల సంఘం, శ్రీకాకుళం డివిజన్ వారి త్రైమాసిక సమావేశం ఆదివారం స్థానిక ఎంపిడిఓ. కార్యాలయంలో నిర్వహించడం జరిగింది. సదరు సమావేశం నందు టైపిస్టుల మరియు స్టేనోగ్రఫర్ల పలు సమస్యల గూర్చి చర్చించారు. జిల్లా అధ్యక్షుడు పి.మణిప్రభ మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లా నుంచి జి.గోపాల్ కృష్ణ ఏపీ రాష్ట్ర టైపిస్టు & స్టెనోగ్రాఫర్స్ సంఘం, రాష్ట్ర కార్యవర్గంలో రాష్ట్ర సెక్రెటరీగా కో-ఆప్షన్ ఎన్నికైనందున శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రభుత్వం జి.ఓ.69 విడుదలచేసి టైపిస్టుల సమస్యలు పరిష్కార దిశగా అడుగులు వేస్తే, జిల్లాస్థాయిలో నేటికీ అమలు పరచకపోగా, క్లారిఫికేషన్ ప్రభుత్వం ఇవ్వాలని మళ్ళీ ప్రభుత్వానికి లెటర్స్ రాయడం బాధాకర మన్నారు. నేటికీ జిల్లాల స్థాయిలో టైపిస్టులు రెగ్యులర్ కాక, ప్రొబేషన్ అవ్వక తీవ్ర అవస్థలు పడుతున్నారని, క్లారిఫికేషన్ కోసం వారి వంతు చేయవలసినది అంతా చేస్తూన్నామని అతి త్వరలో మంచి ఫలితం వస్తుందని ఆశిస్తున్నామని అన్నారు. అదేవిధంగా అన్ని జిల్లాలలో టైపిస్టు నియమాకాలకు (కారుణ్య నియమాలు, బ్యాక్ ల్యాగ్ & గ్రూప్-4) నోచుకోలేదని అందుకు వారి వంతు ప్రయత్నం వారు చేస్తూ పలు మార్లు ప్రభుత్వానికి వినతులు సమర్పిస్తున్నామని అన్నారు. జిల్లాలలో సంఘంను బలోపేతం చేసేందుకు బాడీ మెంబర్లు అలాగే సభ్యులు అందరూ కలిసి కట్టుగా సంఘాన్ని బలోపేతం చేయాలనీ తెలిపారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి లాడే వెంకట రామన్, సంఘ సభ్యులు, జిల్లాలోని పలు శాఖలలో పనిచేయు టైపిస్టులు, స్టేనోగ్రాఫర్లు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులు శాసనసభ నియమాలకు లోబడి ప్రవర్తించాలి

మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ : శాసనసభ్యులు మంత్రులు శాసనసభ నియమాలు లోబడి మాట్లాడవలసి ఉంటుందని మాజీ మంత్రి గుండ అప్పల సూర్యనారాయణ అభిప్రాయాన్ని వెల్లడించారు. ఆదివారం ఒక ప్రకటన విడుదల చేస్తూ... నిన్న ఒంగోలులో ఎన్టీఆర్ కళాక్షేత్రంలో మాజీ మంత్రి ఒంగోలు వైసీపీ శాసనసభ్యులు బాలినేని శ్రీనివాస్ రెడ్డి మాట్లాడే తీరుని దృష్టిలో పెట్టుకుని మాట్లాడుతూ ఆయన మంత్రి హోదాలో డబ్బులు తీసుకున్నానని అదే విధంగా మొన్న తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని 50 లక్షలు పందెం పెట్టానని బహిరంగంగా చెప్పడం ప్రజా స్వామ్యంలో సరైన విధానం కాదని దీనివలన శాసనసభ్యులు, మంత్రులు అవినీతి చేసిన శిక్షాఅర్హులు కారు అనే భావన ప్రజల్లో కలిగేటట్లు తాను మాట్లాడుతున్న మాటలు ఉన్నాయని తెలియజేశారు. అదే సందర్భంలో ఏసీబీ కేవలం ఉద్యోగస్తులకే కాదు, పైచట్టాలు శాసనసభ్యులకు, మంత్రులకు కూడా వర్తిస్తాయన్న విషయాన్ని గమనంలోకి తీసుకోకపోవడం ప్రజాస్వామ్యంలో చాలా బాధాకరమైన విషయమని అన్నారు. రేపు జరగబోయే ఎన్నికల్లో చైతన్య వంతమైన ఓటర్లు అవినీతి పరుల భరతం పడతారని తెలియజేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కూడా భారత దేశ అభివృద్ధికి అవినీతి చెదలు పడుతుందని దానివలన భారతదేశ అభివృద్ధి దెబ్బతింటుందని ఇటీవల ఢిల్లీలో ఎర్రకోట నుంచి సందేశం ఇచ్చిన సందర్భం కూడా మనం గుర్తించాలని, అవినీతివరుల విషయంలో ప్రజలు, చట్టాలు కఠినంగా వ్యవహరిస్తే సుందరమైన ప్రజాస్వామ్యాన్ని పదికాలాలపాటు మనమంతా కాపాడుకోగలమని భవిష్యత్ తరాలకు అందించ దానికి మేధావులు, ముఖ్యంగా యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

సమస్యలపై అధికారులు దృష్టి సారించాలి : జిల్లా అధ్యక్షుడు మణిప్రభ

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : రాష్ట్రంలో టైపిస్టుల సమస్యలపై అధికారులు దృష్టి సారించాలని జిల్లా అధ్యక్షుడు పి.మణిప్రభ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టైపిస్ట్ మరియు స్టేనోగ్రఫర్ల సంఘం, శ్రీకాకుళం డివిజన్ వారి త్రైమాసిక సమావేశం ఆదివారం స్థానిక ఎంపిడిఓ. కార్యాలయంలో నిర్వహించారు. సదరు సమావేశంలో టైపిస్టులు, స్టేనోగ్రఫర్ల పలు సమస్యల గూర్చి చర్చించారు. జిల్లా అధ్యక్షుడు పి.మణిప్రభ మాట్లాడుతూ, శ్రీకాకుళం జిల్లా నుంచి జి.గోపాల్ కృష్ణ ఏపీ రాష్ట్ర టైపిస్టు, స్టెనోగ్రాఫర్స్ సంఘం, రాష్ట్ర కార్యవర్గంలో రాష్ట్ర సెక్రెటరీగా కో-ఆప్షన్ ఎన్నికైనందున శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రభుత్వం జి.ఓ.69 విడుదలచేసి టైపిస్టుల సమస్యలు పరిష్కార దిశగా అడుగులు వేస్తే, జిల్లా స్థాయిలో నేటికీ అమలు పరచకపోగా, క్లారిఫికేషన్ ప్రభుత్వం ఇవ్వాలని మళ్ళీ ప్రభుత్వానికి లెటర్స్ రాయడం బాధాకరమన్నారు. నేటికీ జిల్లాల స్థాయిలో టైపిస్టులు రెగ్యులర్ కాక, ప్రొబేషన్ అవ్వక తీవ్ర అవస్థలు పడుతున్నారని, క్లారిఫికేషన్ కోసం వారి వంతు చేయవలసినది అంతా చేస్తూన్నామని అతి త్వరలో మంచి ఫలితం వస్తుందని ఆశిస్తున్నామని అన్నారు. అదేవిధంగా అన్ని జిల్లాలలో టైపిస్టు నియమాకాలకు (కారుణ్య నియమాలు, బ్యాక్ ల్యాగ్, గ్రూప్-4) నోచుకోలేదని అందుకు వారి వంతు ప్రయత్నం వారు చేస్తూ పలు మార్లు ప్రభుత్వానికి వినతులు సమర్పిస్తున్నామని అన్నారు. జిల్లాలలో సంఘంను బలోపేతం చేసేందుకు బాడీ మెంబర్లు అలాగే సభ్యులు అందరూ కలిసి కట్టుగా సంఘాన్ని బలోపేతం చేయాలనీ తెలిపారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి లాడే వెంకట రామన్, సంఘ సభ్యులు మరియు జిల్లాలోని పలు శాఖలలో పని చేయు టైపిస్టులు మరియు స్టేనోగ్రాఫర్లు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని కలిసేందుకు అవకాశం కల్పించమని వినతి

విశాలాంధ్ర-కవిటి: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న గెస్ట్ లెక్చరర్లు ఆదివారం నాడు బల్లి పుట్టుగ జెడ్పీ చైర్పర్సన్ పిరియా విజయమ్మ నివాసం వద్ద విజయమ్మ ను కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని ఈనెల 15వ తేదీన జిల్లా పర్యటన సందర్భంగా సీఎం జగన్ మోహన్ రెడ్డినీ కలిసేందుకు అవకాశం కల్పించమని వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం విజయమ్మ మాట్లాడుతూ ముఖ్యమంత్రిని కల్పిస్తామని హామీ ఇచ్చారు. తమకు ఉద్యోగ భద్రత కల్పన, కన్సాలిడేటెడ్ పే విధానం వర్తింపజేయడం వంటి సమస్యల్ని పరిష్కరించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలనివారు సీఎంను కోరేందుకు భేటీకి అవకాశం కల్పించేందుకు ఆమె ఉద్యోగసంఘాల నేతలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గెస్ట్ లెక్చరర్లు పాల్గొన్నారు.

జనసేనలో చేరిన వైసీపీ ఎంపీటీసీ అభ్యర్థి

విశాలాంధ్ర-రణస్థలం: జనసేన పార్టీ ఆశయాలు నచ్చి ప్రజలకు మంచి జరగాలంటే అది పవన్ కళ్యాణ్ వల్లే సాధ్యం అనే నినాదంతో ఆయనను నమ్మి ఆదివారం ఎచ్చెర్ల నియోజకవర్గం రణస్థలం మండలం నుంచి నియోజకవర్గ సమన్వయకర్త విశ్వక్సేన్ మండల అధ్యక్షులు గోవింద్ రెడ్డి జనసేన నాయకులు ఆధ్వర్యంలో జనసేన పార్టీలో వైయస్సార్ పార్టీ కొవ్వాడ గ్రామానికి చెందిన వైఎస్సార్ పార్టీ ఎంపీటీసీ అభ్యర్థి సిహెచ్ పున్నమి జెఆర్ పురం పంచాయతీకి చెందిన 10 వార్డు మెంబర్ సుంకరి రమణ, గుగ్గలం స్వప్న, పిట్ట శ్రీనులు జనసేన పార్టీ పిఎసి చైర్మన్ నాదెండ్ల మనోహర్ చేతులమీదగా జనసేన పార్టీలో చేరారు.

ఈశ్వరరావుకు డాక్టరేట్

విశాలాంధ్ర-కవిటి : కేరళ కేంద్ర విశ్వవిద్యాలయంలో డిపార్ట్మెంట్ ఆఫ్ జీనమిక్స్ విభాగం నుండి సోంపేటకు చెందిన తట్ట ఈశ్వరరావు డాక్టరేట్ పొందినట్లు తెలిపారు. రీసెర్చ్ సూపర్వైజర్ డాక్టర్ రంజిత్ కుమావత్ పర్యవేక్షణలో బయోఫిల్మ్ ఆర్కిటెక్చర్,యాంటీబయాటిక్ రెసిస్టెన్స్ మరియు ఎంటరోకాకస్ ఫేకాలిస్‌కు వ్యతిరేకంగా కోరం సెన్సింగ్‌పై రోడెథ్రిన్ మరియు క్లోరాంఫెనికాల్ సినర్జిస్టిక్ అనే అంశంపై పరిశోధన చేశారు. ఈశ్వర్ రావు ఇప్పటి వరకు తన పరిశోధనలను అంతర్జాతీయ జర్నల్స్‌లో 10 రీసెర్చ్ ఆర్టికల్స్ ప్రచురించినట్లు తెలిపారు.

శ్రీముఖలింగేశ్వరుని సన్నిధిలో కేంద్ర పురావస్తు శాఖ ఏపీ సర్కిల్ ఏవో

విశాలాంధ్ర-జలుమూరు : దక్షిణ కాశీగా పేరు గాంచిన శ్రీముఖలింగేశ్వర స్వామివారి సన్నిధిలో కేంద్ర పురావస్తు శాఖ ఏపీ సర్కిల్ ఏవో కే. వెంకటేశ్వర్లు కుటుంబ సమేతంగా దర్శించుకున్నా రని ఆలయ అర్చకులు తెలిపారు. ముందుగా వారికి స్వాగతం పలికి వారి పేరున ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశామన్నారు. శ్రీముఖలింగేశ్వర స్వామి మహత్యాన్ని వారికి అర్చకులు తెలియజేశారని తెలిపారు.

బిరుసువాడ ఆక్రమణలపై లోకాయుక్తలో కేసు

విశాలాంధ్ర-సోంపేట : సోంపేట మేజర్ పంచాయతీ బిరుసువాడ రెవెన్యూలో గల ప్రభుత్వ చెరువు కొత్తబందతో పాటు పలు ప్రభుత్వ కాలువలు ఆక్రమణలకు గురయ్యాయని వాటిపై లోకాయుక్త, ఆంధ్రప్రదేశ్ మానవహక్కుల కమిషన్‌లో ఫిర్యాదులు చేయడం ద్వారా కేసులు నమోదై విచారణ జరుగుతుందని ఫిర్యాదుదారు పొందూరు బాలరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కావున ఆయా ప్రాంతాల్లో గల కొత్తగా వేసిన అక్రమ లేఅవుట్‌లలో క్రయ విక్రయాలు జరిపి ఎవరూ ఇబ్బందులకు గురి కాకుండా తగు జాగ్రత్తలు పాటించాలని కోరారు. క్రయ విక్రయాలు జరిపిన వారికి నష్టం కలిగిన వారికి తాను బాధ్యుడును కానని పేర్కొన్నారు.

వీధిలోనే వర్షపు నీటి ప్రవాహం

విశాలాంధ్ర-జలుమూరు : మండలం యాల్లవాని పేటలో వీధిలోనే వర్షం నీటి ప్రవాహం జరుగుతోంది. వీధిలో సీసీ రోడ్డు, డ్రైనేజీ వంటి సౌకర్యాలు లేకపోవడంతో వర్షం నీరు, ఇళ్లల్లో చేసిన వాడుకనీరంతా వీధిలోనే ప్రవహిస్తోందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి సిమెంట్ రోడ్డు, డ్రైనేజీ నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు. నిధులు మంజూరు అయ్యాయని త్వరలోనే పనులు చేపడతామని పిఆర్ జెఈ కే.శ్రీధర్ తెలిపారు.

పారదర్శకంగా ధాన్యం కొనుగోలు

విశాలాంధ్ర-జలుమూరు : పారదర్శకంగా ధాన్యం కొనుగోలు పారదర్శకంగా చేపట్టాలని జాయింట్ కలెక్టర్ ఎం నవీన్ అధికారులకు ఆదేశించారు. జలుమూరు మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన శనివారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి అధికారులకు ఆదేశించారు.

శిష్టకరణాలను ఓబీసీలో చేర్చాలి...

విశాలాంధ్ర-రణస్థలం : ఆర్థికంగా వెనుకబడిన శిష్టకరణాలను ఓబీసీ లో చేర్చాలని రణస్థలం, లావేరు మండలాల శిష్టకరణ సంఘం గౌరవ సలహాదారు బలివాడ శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో రణస్థలం లావేరు మండలం శిష్టకరణ కార్తీక సమారాధన కార్యక్రమలో మాట్లాడాతూ రాష్ట్రంలో కారణాలను బీసీ లో చేర్చినా కేంద్ర సర్వీస్‌లకు వచ్చే సరికి ఓబీసీ అనివార్యం అవుతోందని అన్నారు. ఇందు కోసం ప్రజాప్రతినిధులు కృషిచేయాలని కోరారు. ఈ సందర్భంగా నూతన కమిటీ ని ఎంపిక చేశారు. గౌరవ అధ్యక్షులుగా రొంపిల్లి నాగరాజు, అధ్యక్షులుగా ఆర్‌వీ రమణ, ఉపధ్యక్షులుగా. బలివాడ ఉమామహేశ్వరరావు, కార్యదర్శిగా కొట్టు శాంతా రావు, ప్రధాన కార్యదర్శిగా కుప్పిలి జగదీశ్ పాత్రో, ట్రెజరేర్‌గా బలివాడ భద్రి, ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నికున్నారు.

బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి

వనభోజన కార్యక్రమంలో పాల్గొన్న తమ్మినేని

విశాలాంధ్ర-ఆముదాలవలస : సమాజం సంతోషంగా, శాంతియుతంగా ఉన్నప్పుడే సమాజ పురోగమనం, శ్రేయస్సు అభివృద్ధి సాధ్యమవు తుందని ఏపీ శాసన సభాపతి తమ్మినేని సీతారాం అన్నారు. పౌర సమాజం సంతోషంగా ఉండాలంటే సమా జంలో వివిధ వర్గాలు సంతోషంగా ఉండాల న్నారు. ఇదే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం వివిధ సామాజిక వర్గాల అభ్యున్నతికు పెద్ద పీట వేస్తుందన్నారు. బ్రాహ్మణుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన తెలియజేశారు. ఆదివారం పట్టణంలో వేద గాయత్రి బ్రాహ్మణ మండల సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన కార్తీక వన భోజన కార్యక్రమంలో సభాపతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రాహ్మిన్ అంటే ఆలోచనలో విశాలమైన, తెలివైన, జీవనోపాధి లో నీతి, మతం, వ్యక్తిత్వంలో చమత్కారం, సాహసం,నాణ్యతలో నిజా యితీ, మానవత్వం, పాత్రలో నమ్రత, నైతికత, పనితీరులో ఆవిష్కరణ, పరి శ్రమ, అభిరుచి లో కొత్తదనం వంటివి అంత ర్భాగంగా నిలుస్తాయన్నారు. బ్రాహ్మణ విద్యార్థి,యువత, పురోహితులు,మహిళలు సంక్షేమం కోసం కార్పొరేషన్ ద్వారా చిత్త శుద్ధితో సేవలు అందించటం జరుగు తుంద న్నారు. కార్పొరేషన్ ద్వారా బ్రాహ్మణులకు ప్రభుత్వంలో పార్టీలో రాజకీయ ప్రాధాన్యత కల్పించిందన్నారు. విద్య, ఉపాధి, ఉద్యోగ రంగాల్లో బ్రాహ్మణ యువత ముందు వరు సలో నిలవాలని స్పీకర్ ఆకాంక్షించారు. నియోజకవర్గంలో ఉన్న బ్రాహ్మణ కుల అభి వృద్ధిలో ముఖ్య భాగస్వామిగా నిలుస్తాన న్నారు. శ్రీ వేద గాయత్రి బ్రాహ్మణ సంఘానికి కమ్యూనిటీ హాల్ కోసం స్థలాన్ని కేటాయించ మని త్వరలో కమ్యూనిటీ హాల్ కూడా కట్టిం చి ఇస్తామని ఆయన అన్నారు.

హక్కులపై అవగాహన అవసరం

మానవ హక్కుల సంఘం ప్రతినిధి పేడాడ

విశాలాంధ్ర-ఆమదాలవలస : ప్రభుత్వాలు ఇచ్చే ఉచితాలకు ఇతర స్కీములకు ఆశపడి ఓటు వేస్తున్న జనం రేపటి రోజున తమకు రాజ్యాంగపరంగా అందాల్సిన సౌకర్యాలు అందనప్పుడు ప్రశ్నించే గుణాన్ని మరచి పోతున్నారని అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం విజయనగరం జిల్లా శాఖ అధ్యక్షుడు పేడాడ జనార్ధన రావు అన్నారు. మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా జరిగిన కార్య క్రమంలో మాట్లాడారు. ఈ దేశంలో ప్రతి పౌరుడు తన హక్కుల గురించి తెలుసు కోవాలని ప్రజలు ప్రశ్నించే తత్వాన్ని అలవాటు చేసుకుంటేనే ప్రభుత్వాలు పారదర్శక పాలన అందిస్తుంది అన్నారు. ఈ కార్యక్రమానికి భూ సేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ బి.సుదర్శన్ దొర ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దేశంలో ప్రతి పౌరుడికి రాజ్యాంగం ఎన్నో హక్కులు కల్పించిందని,అయితే పౌరులకు వాటిపై అవగాహన లేక ఎవరో వస్తారని,ఏదో చేస్తారనే భ్రమలో మిగిలిపోతున్నారని ఆయన అన్నారు.ఈ పరిస్థితి పోవాలంటే ప్రజల్లో హక్కుల పట్ల అవగాహన పెరగాలని, అలా జరిగినప్పుడు ఆరోగ్యకరమైన సమా జం ఏర్పడి దేశం అభివృద్ధి సాధించ గలుగు తుందని ఆయన పేర్కొన్నారు. పూర్వ సమాజంలో ఎటువంటి సంఘాలు, యూని యన్లు లేకపోయినా హక్కుల కోసం ప్రశ్నించే వారని,అలాగే ఎవరూ చెప్పకుండానే సాటి మనిషికి సాయపడే నైజం ఉండేదని అన్నా రు. ముందుగా మన హక్కుల సంఘం నాయ కులకు అభినందించి జ్ఞాపికలను అందించారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సనపల అన్నాజీరావు, పాత్రికేయుడు ఎలిశెట్టి సురేష్ కుమార్ లను సత్కరించారు. ఈ సమావేశంలో ఇంకా మానవ హక్కుల సంఘం మన్యం జిల్లా అధ్యక్షుడు బడే నాగభూషణ రావు, జిల్లా కోశాధికారి పూజారి భాస్కరరావు, బొడ్డేపల్లి చిరంజీవ రావు, జడ్డు రామకృష్ణ పూజారి బాలాజీ ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు మంత్రి విడదల రజని పలాస పర్యటన

విశాలాంధ్ర-శ్రీకాకుళం : వైద్య ఆరోగ్య శాఖ మంత్రి శ్రీమతి విడదల రజని నేడు జిల్లాలో పర్యటించనున్నారు. ఈ మేరకు ఆమె పర్యటన వివరాలను కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఆదివారం సాయంత్రం వెల్లడించారు. ఆదివారం సాయంత్రం ఆమె విశాఖపట్నం నుంచి రోడ్డు మార్గం ద్వారా పలాసలోని పవర్ గ్రిడ్ వసతి గృహానికి చేరుకొని రాత్రి బస చేస్తారు. సోమవారం ఉదయం 9 గంటలకు ఆమె పలాసలోని వైయస్సార్ కిడ్నీ రీసెర్చ్ సెంటర్, ఆసుపత్రిని సందర్శిస్తారు. ఆసుపత్రిలోని విభాగాలను పరిశీలించిన అనంతరం అక్కడే విలేకరుల సమావేశంలో మాట్లాడుతారని, పర్యటన అనంతరం ఉదయం 10 గంటలకు ఆమె విశాఖపట్నం తిరిగి వెళ్తారని కలెక్టర్ తెలిపారు.

'కవన మంజరి' గ్రంథ ఆవిష్కరణ మహోత్సవం

విశాలాంధ్ర-అరసవల్లి : నగరంలో తెలుకుల సంక్షేమ సంఘం భవనంలో అఖిల గాండ్ల తెలికుల సంఘం (ఏజీటీఎస్ఎస్ ఆధ్వర్యంలో) తలితిరి తరుణయ్యచే రచింపబడిన 'కవన మంజరి' గ్రంథ ఆవిష్కరణ మహోత్సవం జరిగింది. డాక్టర్ ముద్రు ముత్యాల నాయుడు పుస్తకావిష్కరణ గావించారు. ఈపుస్తకావిష్కరణ మహోత్సవా నికి బ్రహ్మశ్రీ బులుసు వెంకటేశ్వరరావు అధ్యక్షలుగా వ్యవహరించారు. ఈకార్యక్రమానికి బ్రహ్మశ్రీ డాక్టర్ యాజ్ఞవల్క శర్మ, వక్తగా వ్యవహరించారు. పంచదారల మాణిక్యాలరావు పుస్తక సమీక్ష చేశారు. ఈ కార్యక్రమానికి తరిణయ్య కుటుంబ సభ్యులు, మేమున్నాం స్వచ్ఛంద సంస్థ సభ్యులు, బంధువులు, మిత్రుల ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో దాసరి జ్ఞానమూర్తి ఏజీటీఎస్ఎస్ జనరల్ సెక్రెటరీ, తలితిరి తవిటయ్య, జానకిరామ్, తోనంగి జోగారావు మాస్టారు, వంగూరు మధుసూదన్‌రావు సంజీవి ధర్మరాజు, గండేపల్లి శ్రీనివాసరావు, ఐ.వి. రామన్న, ఎండపల్లి ఈశ్వరరావు, పిట్ట చంద్రపతిరావు, ఇంజిరావు వెంకట రమణ, గండేపల్లి మల్లేష్ సమక్షంలో ఘనంగా నిర్వహించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ : నగరంలో ఉన్న పి.ఎస్.న్.ఎం హైస్కూల్‌లో 1980 సంవత్సరం పదో తరగతి బ్యాచ్ విద్యార్థులంతా ఆదివారం హోటల్ గ్రాండ్ లో కలుసుకున్నారు. ఈ ఆత్మీయ కలయికను కేశిరెడ్డి వెంకటేష్, బండారు వెంకటరమణ, గురిజిల్లు రాధాకృష్ణ అందరి సహకారంతో ఏర్పాటు చేశారు. పూర్వ విద్యార్థులంతా ఒకరికినొకరు పలకరించుకున్నారు. ప్రస్తుతం ఎవరెవరు ఏమి చేస్తున్నారన్నది ఒక్కొక్కరు పరిచయం చేసుకున్నారు. స్కూలు రోజుల నాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఎంతో ఆనందంగా గడిపారు. మధ్యాహ్నం అందరూ కలిసి భోజనం చేశారు. తర్వాత వారంతా గ్రూపు ఫొటో తీయించుకున్నారు. అనంతరం ఆనాటి ఉపాధ్యాయులు శ్రీరాములు, మోహన్ నాయుడు, నవీన్ చంద్రుడు హెచ్‌ఎం శంకర్రావుకి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నరసింగరావు, చిట్టి మోహన్, నాగపద్మ, మైథిలి రాణీ తదితరులు పాల్గొన్నారు.

హ్యూమన్ రైట్స్‌పై అవగాహన అవసరం

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : మానవ హక్కుల పై విషయ పరిజ్ఞానం ఉంటే ప్రతి వ్యక్తీ కొంత రక్షణ పొందవచ్చని ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ నవ్య అన్నారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవ కార్యక్రమాన్ని హ్యూమన్‌రైట్స్ ఫెడరేషన్ స్థానిక శాఖ అధ్యక్షులు దక్కత క్రిష్ణమూర్తి ఆధ్వర్యంలో శాంతినికేతన్ పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేసారు. విద్యార్థి దశ నుండి పాఠ్యాంశాలతో పాటు సామాజిక స్థితిగతుల పట్ల కూడా అవగాహన అవసరం అని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య కళాశాల ప్రిన్సిపల్ ఎమ్.రాజేంద్ర, హ్యూమన్‌రైట్స్ కౌన్సిల్ ప్రతినిదులు ఎం రాంబాబు, కే.రామారావు, కేసీ పూరి, తులసీరావు తదితరులు పాల్గొన్నారు.

జన ఆధరణతో స్వాగతిద్దాం : పలాస మున్సిపల్ చైర్మన్ గిరిబాబు

విశాలాంధ్ర-పలాస : రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి ఈ నెల 15న పలాస వస్తున్న సందర్భంగా జన ఆధరణతో స్వాగతిద్దామని పలాస కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. ఆదివారం పలాస కాశీబుగ్గ పురపాలక సంఘం కార్యాలయంలో సివోఎస్‌లు, ఆర్.పిలు మరియు సిఎల్ ఆర్‌పిలతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి వస్తున్న సందర్భంగా కనివిని విధంగా స్వాగతం పలికేందుకు అందరు కృషి చేయాలన్నారు. వైసీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలకు పెద్ద పీట వేస్తుందని, ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డికి కృతజ్ఞతలు తెలిపేందుకు గ్రూపు సభ్యులందరు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. ముఖ్యమంత్రిచే కిడ్నీ ఆసుపత్రి ప్రారంభోత్సవం అనంతరం పలాస రైల్వే క్రీడా మైదానంలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయడం జరిగిందని, ఆ సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కమిషనర్ టి.నాగేంద్రకుమార్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక వన సమారాధన

విశాలాంధ్ర-బూర్జ : పూర్వం కార్తీక మాసంలో ఉసిరి చెట్టు కింద మునులు.... విష్ణువును ప్రతిష్టించి పూజలు చేసే వారిని పురాణాలు చెబుతున్నాయి. అదే సాంప్రదాయంగా బూర్జ మండలం, వైపర్త గ్రామ పవిత్ర నాగావళి తీరంలోని ఓ తోటలో ఉసిరి చెట్టు వద్ద ఆదివారం గ్రామస్తులు ఘనంగా కార్తీక వన సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం అర్చకులు రంపా ప్రతాప్ శర్మ ఆధ్వర్యంలో జరిగింది. తొలుత మహిళలు ఉసిరి చెట్టువద్ద ప్రత్యేక పూజలు, అభిషేకాలు, భజనలు, వివిధ సత్సంగ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు యందవ అప్పలనాయుడు, తంకాల అన్నమనాయుడు, యందవ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పరిసర గ్రామాలనుండి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. వివిధ చోట్ల ఆదివారం పిక్నిక్ సందడి నెలకొంది. వివిధ చోట్ల ఉసిరి చెట్టు కింద సహపంక్తి భోజనాలు చేపడుతున్నారు. ప్రతి సంవత్సరం కార్తీక మాసంలో ఉసిరి చెట్టు కింద భోజనాలు చేయడం ఆనవాయితీగా వస్తుందని పలువురు తెలిపారు.

చెకుముకి సైన్స్ సంబరాలను విజయవంతం చేయండి

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: జిల్లాలో చెకుముకి హైస్కూల్ స్థాయి సైన్స్ సంబరాలు 380 పాఠశాలల్లో జరిగాయని అందులో 22వేలు మంది విద్యార్థులు పాల్గొన్నారనీ జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కుప్పిలి కామేశ్వరరావు గొంటి గిరిధర్, జిల్లా ఉపాధ్యక్షులు పి. కుర్మారావు, చెకుముకి జిల్లా కన్వీనర్ ఎస్ సాయి శ్రీనివాస శర్మ తెలిపారు. రెండవ స్థాయిలో మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు డిసెంబర్ 21న జిల్లాలోని 30 మండలాల్లో జరుగుతుందని అందులో 380 టీంలు, 1140 మంది విద్యార్థులు పాల్గొంటారని వారు తెలిపారు. 3వ స్థాయి జిల్లా స్థాయిలో చెకుముకి సైన్సు సంబరాలు 2024 జనవరి 7న శ్రీకాకుళంలో నిర్వహించడం జరుగుతుందని అందులో 77 టీంలతో 231మంది విద్యార్థులు పాల్గొంటారని, 4వ స్థాయి రాష్ట్ర స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు 2024 ఫిబ్రవరి 10,12 తేదీలలో జరుగుతాయని వారు తెలిపారు. చెకుముకి సైన్స్ సంబరాలను విజయవంతం చేయాల్సిందిగా విద్యాశాఖ అధికారులు,హెడ్మాస్టర్లు ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సైన్స్ ఉద్యమ అభిమానులు,విద్యార్థిని విద్యార్థులకు వారు విజ్ఞప్తి చేశారు.

శ్రీముఖలింగేశ్వర క్షేత్రంలో శివ స్వాముల సందడి

విశాలాంధ్ర-జలుమూరు : మండలంలోని ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో శివస్వాములు ఇరుముడులు విరమణ చేశారు. శరన్నవరాత్రులు అనంతరం మాల ధరించారు. మండలి దీక్ష అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు, వారాహి అమ్మ వారికి కుంకుమ పూజలు నిర్వహించారు. వంశధార నదిలో పుణ్య స్నానాలు చేసి స్వామివారికి మొక్కులు తీర్చి తలనీలాలు సమర్పించారు. విజయనగరం, బలిజిపేట, డెంకాడ, విశాఖపట్నం నుంచి స్వాములు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

నాదెండ్ల సమక్షంలో సర్పంచ్ చేరిక

విశాలాంధ్ర-మెళియాపుట్టి : పాతపాట్నం నియోజకవర్గ జనసేనపార్టీ సమన్వయకర్త గేదెల చైతన్య ఆధ్వర్యంలో పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ సమక్షంలో మండలంలో గల గొకర్ణపురం పంచాయతీ సర్పంచ్ సేనాపతి రవికుమార్ జనసేనపార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయనను పార్టీ కండువాను కప్పి మనోహర్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ జనసేనపార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఆశయాలు, ఆలోచనలు నచ్చి పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. అనంతరం మండలంలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఆయనను కలిసిన వారిలో మండల జనసేనపార్టీ నాయకులు దుక్క బాలరాజు, తిరునగరి ప్రసాద్, దుప్పల భారత్, చంటి, లక్ష్మీపురం కిరణ్, చింతల ప్రశాంత్, రామ్మూర్తి తదితరులున్నారు.

ఆ నిర్మాణం సక్రమమా... అక్రమమా?

విశాలాంధ్ర-సోంపేట : సోంపేట పట్టణం శివారున బిరుసువాడ రెవెన్యూలో సోంపేట-కంచిలి మెయిన్‌రోడ్డుకు సమీపంలో ఇటీవల చేపడుతున్న నిర్మాణాన్ని రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. ఆ నిర్మాణం సక్రమం కాదని అక్రమమని రెవెన్యూ వర్గాలు వాదిస్తుండగా నిర్మాణదారులు మాత్రం అది సక్రమమేనని తాము కొనుగోలు చేశామని పేర్కొంటున్నారు. ఏదిఏమైనప్పటికి తహశీల్దార్ సత్యన్నారాయణ ఈ విషయంలో ఒక అడుగు ముందుకు వేసి ప్రభుత్వ కాలువలో అక్రమ నిర్మాణం చేస్తున్నారని నిర్మాణదారులపై చర్యలు తీసుకోవాలని సోంపేట పోలీసులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్సై హైమావతి నిర్మాణదారులను పిలిచి ఘాటుగా హెచ్చరించినట్లు తెలుస్తోంది. అయితే దీనిపై నిర్మాణదారులు ఎస్సై హైమావతికి లిఖిత పూర్వకంగా వివరణ ఇచ్చారు. సదరు స్థలాన్ని 2011లో కొనుగోలు చేశామని 2011/3 సర్వే నెంబరు ద్వారా తమకు విక్రయించగా అప్పట్లో సోంపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేశామని పేర్కొన్నారు. అయితే నిర్మాణం చేస్తున్న స్థలాన్ని రెవెన్యూ వర్గాలుసర్వే 211/1గా ధృవీకరించడంతో తాము మోసపోయినట్లు తెలుసుకున్నామని సదరు వివరణలో పేర్కొన్నారు. తమకు సదరు స్థలాన్ని విక్రయించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదిలా ఉండగా బిరుసువాడ రెవెన్యూలో పొందూరు బాలరాజు అనే వ్యక్తి వివిధ లేఅవుట్‌లు ప్రభుత్వ చెరువులలో ఆక్రమణలు, అవకతవకలు భారీగా జరుగుతున్నాయని నేరుగా రాష్ట్ర లోకాయుక్త రాష్ట్ర మానవహక్కుల కమిషన్‌లలో ఫిర్యాదులు చేయడం గమనిస్తే ఇక్కడ పరిస్థితులు ఏ విధంగా ఉన్నాయో విశదమవుతుంది. ఇక్కడ ముఖ్యంగా పట్టణ పరిసరాల్లో రెవెన్యూ యంత్రాంగం నిర్లక్ష్యం వలన పలువురు కబ్జాదారులు ఇష్టారాజ్యంగా కోట్ల రూపాయల విలువైన చెరువుల స్థలాలను ఆక్రమించడం, తప్పుడుస సర్వే నెంబర్లుతో విక్రయించడం వంటి కార్యకలాపాలకు దర్జాగా పాల్పడుతూ కోట్లకు పడగలెత్తుతున్నారన్న ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. కొత్తబంద చెరువు కబ్జాకు

గురైనట్లు దానిపై చర్యలు తీసుకోవాలని ఏడాది క్రితం పెద్దఎత్తున ప్రతిఘటించిన అనేక మంది ఆకస్మాత్తుగా మౌనం దాల్చడం వెనుక ఏమి జరిగిందో ఏమో వారికే తెలియాల్సి ఉంది. ఎన్నో అక్రమాలు జరుగుతున్నప్పటికి అడిగే నాథుడు లేకపోవడం, పట్టించుకోవల్సిన యంత్రాంగం నిర్లక్ష్యం వహించడంతో సోంపేట మేజర్ పంచాయతీలో కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ భూములు కబ్జాలు కాబడి కోట్లాది రూపాయలు చేతులు మారాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. రెవెన్యూ యంత్రాంగం నిర్లక్ష్యాన్ని వీడి సోంపేటలో చెరువులు, ప్రభుత్వ కాలువలుపై రీసర్వేలు జరిపించి ఆయా స్థలాలను, చెరువులను కాపాడాలని పలువురు అభ్యుదయవాదులు ఫిర్యాదుల ద్వారా కోరుతూనే ఉన్నారు.

ఉల్లాసంగా... ఉత్సాహంగా

విశాలాంధ్ర-సోంపేట : సోంపేటతోపాటు చుట్టుప్రక్కల గ్రామాల శ్రీశయన సామాజిక వర్గీయుల వనభోజన మహోత్సవం ఘనంగా జరిగింది. సోంపేట పట్టణ శ్రీశయన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పట్టణ సమీపంలోని సర్దార్ ఘాట్ లచ్చన్న సమీపంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి శ్రీశయనులు వేల సంఖ్యలో తరలి వచ్చారు. ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి గౌతు శ్యామసుందరశివాజీ, జెడ్పీటీసీ తడక యశోద, రాష్ట్ర శ్రీశయన కార్పోరేషన్ చైర్మన్ పంకజాక్షి దేవ్, రాష్ట్ర శ్రీశయన సంఘ అధ్యక్షుడు లోడ అప్పారావు తదితరులు హాజరై ప్రసంగించారు. శ్రీశయనుల చరిత్ర ఎంతో గొప్పదని కొనియాడారు. రాష్ట్రంలో గౌడ, శెట్టిబలిజ, శ్రీశయన, ఈడిగ, యాత మొదలగు కులాలన్ని ఒకే తెగకు చెందినవి అన్నారు. ఈ కులాల ఏకమైతే తెలుగు రాష్ట్రాల్లో శ్రీశయనుల మన ప్రాబల్యం మరింతగా పెరుగుతుందని పేర్కొన్నారు. పట్టణ శ్రీశయన సంఘ అధ్యక్షుడు రెల్ల నారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న శ్రీశయనులు ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. శ్రీశయనులు ఐక్యతగా ఉంటూ అన్ని రంగాల్లోను మంచి విజయాలు సాధించవచ్చని సూచించారు. కార్యక్రమంలో శ్రీశయన సంఘ అధ్యక్షుడు దీనబంధు, స్థానిక టీడీపీ సీనియర్ నేత బీన ఆనంద్, పలాసపురం సర్పంచ్ తడక జోగారావు, గౌతు యశోదమ్మ, తదితరులు హాజరయ్యారు.

తెలుగుభాషను ఇనుమడింపజేయాలి

ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు



విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ : తెలుగు భాష కీర్తి ప్రతిష్టతలు ప్రపంచం నలుమూలల వ్యాప్తంగా తెలిసే విధంగా రాజమండ్రిలో జరగనున్న రెండవ అంతర్జాతీయ తెలుగు మహాసభలు జనవరి 5,6,7 తేదీలు లో రాజమహేంద్ర వరం (రాజమండ్రి)లో జరగాలని శ్రీకాకుళం పార్లమెంటు సభ్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. రెండవ తెలుగు అంతర్జాతీయ మహాసభ ల శ్రీకాకుళం జిల్లా ప్రతినిధి లఖినాన రవికుమార్, సాహితీ చైతన్య కిరణాలు, బాలకదా నిలయం అధ్యక్షులు డా. భోగెల. ఉమామహేశ్వర రావు (ఉమాకవి) ఆధ్వర్యంలో రెండవ అంతర్జాతీయ తెలుగు మహాసభల ఆహ్వాన పత్రిక ను ఎంపి. చే ఆవిష్కరణ చేయించారు. ఈ సందర్భంగా ఎం. పి. మాట్లాడుతూ మాజీ శాసన సభ్యులు, చైతన్య విద్యాసంస్థ ల వ్యవస్థపాక అధ్యక్షులు కె. వి. వి. సత్యనారాయణ రాజు రాజమండ్రి లో కలసినపుడు చెప్పారని అంటూ, ఉత్తరాంధ్ర జిల్లాల శ్రీకాకుళం, విజయనగరం విశాఖ పట్నం, అనకాపల్లి, పార్వతీపురంమన్యం జిల్లా, పాడేరు జిల్లా ల నుంచి తెలుగు మహాసభలకు తరలి వెళ్లి విజయవంతం చేయాలని కోరారు. ఉమా కవి, రవి మాట్లాడు తూ ఆంధ్ర సారస్వత పరిషత్, చైతన్య విద్యాసంస్థల సంయుక్త ఆధ్వర్యంలో జనవరి 5, 6, 7 తేదీలలో రాజమహేంద్రవరంలో రాజరాజనరేం ద్రుని పట్టాభిషేక సహస్రాబ్ది ఉత్సవాలలో భాగంగా రెండో ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించనున్నట్లు ,,, ఆంధ్రమేవ జయతే అన్న నినాదంతో ఈ సభలు నిర్వహిస్తున్నామని, దీనిలో భాగంగా తెలుగు భాషలో ఉన్న వివిధ ప్రక్రియలకు సంబంధించిన 26 సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. తెలుగు భాష కోసం విశేష కృషి చేసిన ఎందరో కవులు, పండితులు, కళాకారులు, సినీ ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరవుతారన్నారు. ఆదికవి నన్నయ మహాభారత రచనకు శ్రీకారం చుట్టి వెయ్యి సంవత్సరాలైన సందర్భంగా వెయ్యి మంది కవులతో ఆదికవి నన్నయకు నీరాజనం ఇచ్చే కార్యక్రమం చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు. పదివేల మంది విద్యార్థులతో వేమన శతక పద్యాలు వల్లె వేసే కార్యక్రమంతో పాటు తెలుగు భాషా పరిరక్షణ కార్యక్రమాలపై ఒక ప్రత్యేక సదస్సు నిర్వహిస్తామన్నారు. ఇందుకోసం ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్, ఆధ్వర్యంలో జరుగుతున్నాయని భోగెల ఉమా కవి తెలిపారు.

బాబు షూరిటీ - భవిష్యత్ గ్యారంటీ

- మీ పిల్లల భవిష్యత్తుకి నేను గ్యారెంటీ
- కూన రవికుమార్

విశాలాంధ్ర-సరుబుజ్జిలి: టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు మరియు జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ కలిసి సమిష్టిగా బాబు షూరిటీ - భవిష్యత్ గ్యారంటీ వాగ్దానాలు ప్రకటించడం తెలిసిందే. భవిష్యత్తు గ్యారంటీలో భాగంగా శ్రీకాకుళం జిల్లా పార్లమెంటరీ అధ్యక్షులు కూన రవికుమార్ సరుబుజ్జిలి గ్రామంలో భవిష్యత్ గ్యారంటీ కరపత్రాలు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామంలోని ఇంటింటికి వెళ్లి మీ పిల్లల భవిష్యత్తు కి మేము గ్యారెంటీ అంటూ ఆరు గ్యారెంటీ కరపత్రాన్ని పంపిణీ చేశారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఆడబిడ్డ నిధి, 3-ఉచిత గ్యాస్ సిలిండర్లు(దీపం), మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, అన్నదాత, యువగలం మరియు బీసీలకు రక్షణ చట్టం తెచ్చే విధంగా వెనకబడిన తరగతుల వారందరికీ అండగా ఉంటామని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మరియు మీ పిల్లలకు ఉజ్వలమైన భవిష్యత్తు చంద్రబాబు వల్లే సాధ్యమవుతుందని అన్నారు. మేధావులు విద్యావంతులు రేపటి భవిష్యత్తు కోసం ఆలోచిస్తున్నారని, నిరుద్యోగులు చంద్రబాబు పై పెట్టుకున్న నమ్మకాన్ని నెరవేర్చే విధంగా భవిష్యత్తు గ్యారెంటీ పత్రాన్ని ప్రతి ఇంటికి అందజేస్తున్నామని రవికుమార్ తెలియజేశారు. పార్టీలకు అతీతంగా బలమైన ఆర్థిక వ్యవస్థను నిర్మించడమే చంద్రబాబు నాయుడు బాధ్యతని, కచ్చితంగా రేపు ఏర్పాటయ్యేది తెలుగుదేశం ప్రభుత్వం అని ప్రతి ఒక్కరు గుర్తించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి శివాల సూర్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు నందివాడ గోవింద, మండల అధ్యక్షుడు అంబాల రాంబాబు, జిల్లా తెలుగు యువత ప్రతినిధి కూన సంజీవ్, కొర్ను సూర్యనారాయణ, మీసాల రామారావు, కూన గణపతి రావు, కూటికుప్పల కోటేశ్వరరావు, స్థానిక నాయకులు ఎండ రామారావు, కొమనాపల్లి రవికుమార్, దవల సింహాచలం, గుర్రాల చిన్నబాబు, ఇల్లాకుల ప్రభాకర్ మరియు టిడిపి కార్యకర్తలు గ్రామ ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కుశాలపురంలో ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర-ఎచ్చెర్ల : కుశాలపురం లో ఆదివారం అక్షయ సేవాసమితి సహకారంతో ఉచిత వైద్య శిబిరం జరిగింది. గ్యాస్ట్రో ఎంట్రాలజీ డాక్టర్ ఆర్ ప్రశాంత్, కంటి వైద్యులు డాక్టర్ వి దినేష్ లు 125 మందికి పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు బోడిగి మధు ఉపాధ్యక్షులు కిరణ్ కుమార్, అనిల్ కుమార్, కార్యదర్శి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

130వ రోజుకు చేరుకున్న అన్నా క్యాంటీన్ నిత్య అన్నదానం

విశాలాంధ్ర-శృంగవరపుకోట : పేదలి ఆకలిని తీర్చడమే లక్ష్యంతో శృంగవరపుకోట మండల కేంద్రంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట, పుణ్యగిరి రోడ్డులో మాజీ మంత్రి స్వర్గీయ కోళ్ల అప్పలనాయుడు జ్ఞాప కార్థం, కోళ్ల పైడితల్లమ్మ ఆశీస్సులతో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్ నిర్విరామముగా శృంగవరపుకోట నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జ్ & మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి ఆధ్వర్యంలో కొనసాగుతుంది. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు సమక్షంలో 130వ రోజు అన్న క్యాంటీన్ ద్వారా ఆదివారం సందర్భంగా మధ్యాహ్నం వచ్చిన 300 మంది పేదవారికి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉచితంగా భోజనం వడ్డించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ అభ్యర్థి భీశెట్టి అరుణ, విశాఖ టీడీపీ పార్లమెంటరీ కార్యనిర్వాహక కార్యదర్శి కాపుగంటి శ్రీనివాసు, రాష్ట్ర ఐటీడీపీ కార్యదర్శి చక్కా కిరణ్ కుమార్, నియోజకవర్గ ఐటీడీపీ కార్యదర్శి అనకాపల్లి చెల్లయ్య, యువత భీశెట్టి మోహన్ కుమార్, గోపి, మునగపాక అప్పారావు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జోగంపేట తదితర గ్రామాల్లో బాబు భవిష్యత్ కరపత్రాలు పంపిణీ

విశాలాంధ్ర-సీతానగరం : మండలంలోని జోగమ్మపేట తదితర పార్వతీపురం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి బోనెల విజయ్ చంద్ర ఆదేశాల మేరకు మండల పార్టీ అధ్యక్షులు,కార్యదర్శి, కొల్లి తిరుపతిరావు, రౌతు వేణుగోపాల నాయుడు పర్యవేక్షణలో బాబు భవిష్యత్తు గ్యారెంటీ బాబు షూరిటీ ప్రోగ్రాంని నిర్వహించారు. జోగంపేట క్లస్టర్ ఇంచార్జి బొమ్మినాయుని లక్ష్మణరావు, బూత్ ఇంచార్జి బొమ్మి నాయుని శ్రీనివాసరావు, అరుకు పార్లమెంట్ తెలుగు యువత కార్యదర్శి టాంకల శ్రీనివాసరావు సీనియర్ కార్యకర్తలు మర్రాపు రామకృష్ణ,జాగాన తిరుపతిరావు (గోవిందా), తెలుగుదేశం కార్యకర్తలు పాల్గొన్నారు.

అయోధ్య రాముని యాగ అక్షింతల శోభాయాత్ర

విశాలాంధ్ర-ఎచ్చర్ల : అయోధ్య రాముని యాగ అక్షింతల శోభాయాత్ర మండలంలోని కుశాలపురం గ్రామపంచాయతీ జాతీయ రహదారి నుండి రాజరాజేశ్వరి పీఠం వరకు విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో భక్తులు నిర్వహించారు. శ్రీరామ జయరామ జయజయరామ అంటూ భక్తులు సంకీర్తనలు చేసుకుంటూ రాజరాజేశ్వరి అమ్మవారి పీఠం వద్ద ఉంచడం జరిగింది. తదుపరి ఆ అక్షింతలతో సుమారుగా 250 కేజీల బియ్యం పసుపు నెయ్యి కలిపి సంప్రోక్షణ చేసి వాటిని మండలంలోని 28 గ్రామపంచాయతీలో గల గ్రామాల్లోని అన్ని ఇళ్లకు చేరవేసేందుకు విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు లోకనాథం ఆనందరావు, జిల్లా కోశాధికారి ధర్మవరపు ఆచారి, మండల ప్రఖండ లావాటి అన్నారావు, ప్రఖండ కార్యదర్శి ఇప్పిలి భీమారావు మరియు 28 గ్రామ పంచాయతీల కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రిస్టమస్ పండుగ ఏర్పాట్లను మాజీ ఎమ్మెల్యే పరిశీలన

విశాలాంధ్ర-పార్వతీపురం : మండలంలోని కృష్ణపల్లి గ్రామంలో క్రిస్టమస్ పండుగ ఏర్పాట్లు గూర్చి చర్చి ఫాదర్, నాయకులతో మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు ఆదివారం మాట్లాడారు. క్రిస్టమస్ పండుగ ఏర్పాట్లను ఘనంగా చేయాలని తీర్మానించారు. ఈకార్యక్రమంలో క్రైస్తవ సోదరులు పలువురు పాల్గొన్నారు.

ఘనంగా అపోటా మేధా సమ్మాన్

విశాలాంధ్ర-సోంపేట : ఆంధ్రప్రదేశ్ ఒడియా టీచర్స్ అసోసియేషన్ (అపోటా) ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ జూని యర్ కళాశాల ఆవరణలో ఆదివారం నిర్వహించిన మేధాసమ్మాన్ కార్యక్రమం ఘనంగా జరిగింది. జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ ముఖ్య అతిథిగా, ఎమ్మెల్యే బెందాళం అశోక్, ఎంఎల్‌సి నర్తు రామారావు, మాజీ కేంద్ర మంత్రి కిల్లి కృపారాణి, ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాసు తదితరులు కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ మాట్లాడుతూ ఒడియా విద్యాభివృద్ధి కోసం విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆమె మాట్లాడారు. ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే అశోక్ మాట్లాడుతూ జీఓ నెంబరు 117 రద్దు కోసం కృషి చేస్తానని అన్నారు. ఎమ్మెల్సీ రామారావు మాట్లాడుతూ ఒడియా ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రతిభా పరీక్షలు నిర్వహించి వారిని సన్మానించడం ఎంతో అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా ఇటీవల పదవీ విరమణ చేసిన 30మంది ఒడియా ఉపాధ్యాయులను అపోటా ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ నగిరి ప్రభావతి, డీఈఓ వెంకటేశ్వరరావు, అపోటా ప్రతినిధులు సత్యన్నారాయణపాడి, బృందావన్ దొళాయి, రాజేంద్రప్రసాద్, అద్వైత్‌కుమార్, భీంసేన్ మహాపాత్రో, నల్ల గోవిందరాజు, గణపతి సాహు, తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనిక ఉద్యోగుల సమాఖ్య సమావేశం

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: నగరంలోని జీ టి రోడ్ లో గల మీన కృష్ణ ప్లాజా లో "అఖిల భారత మాజీ సైనిక ఉద్యోగుల సమాఖ్య" రిజిస్టర్డ్ ట్రేడ్ యూనియన్ శ్రీకాకుళం జిల్లా ప్రాంతీయ సమావేశం జిల్లా కార్యదర్శి గిరిధర్ నాయక్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశం లో జిల్లా నుంచి వివిధ బ్యాంకులలో పనిచేస్తున్న మాజీ సైనికులు 120 మంది హాజరయ్యారు. జాతీయ కార్యదర్శి సురేష్ కుమార్ సమాఖ్య ప్రాముఖ్యతను, ఇప్పటి వరకు జరిగిన పోరాటాలు, విజయాలు మరియు ముందున్న సవాళ్ళ గురించి కులాంకుశంగా సభులతో చర్చించారు. మాజీ సైనికుల బ్యాంకు ఉద్యోగుల కోసం ప్రత్యేక బదిలీ విధానం రూపొందించాలని కేంద్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి జీ కాంతారావు, సెంట్రల్ కమిటీ మెంబర్ ఏ వి జి రాజు, సభ్యుల సమస్య లను తెలుసుకొని వాటి పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఈ సమావేశానికి ఏం మురళీ కృష్ణ, కే మోహన్ రావు, బీ అప్పారావ్, బీ న్ ప్రతాప్, పీ నాగభుషన్, కే రమేష్, శ్రీధర నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రేమతత్వం అలవర్చుకోవాలి

ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎస్వీ రమణ

విశాలాంధ్ర-పోలాకి: ప్రతి వ్యక్తి ప్రేమతత్వం అలవర్చుకోవాలని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త పాలకొండ సత్య సాయి సేవ సమితి కన్వీనర్ శ్రీశ్రీశ్రీ ఎస్వీ రమణ అన్నారు. ఆదివారం చింతాడపేట శ్రీ స్వామి రామయోగి సేవాశ్రమంలో జరిగిన సత్సంగ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సభాధ్యక్షులు బమ్మిడి విశ్వనాథం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రేమతోనే సమాజంలో మార్పు తేగలమని అందుకు శాంతితో మెలగాలని కోరారు. జరిగిన కార్యక్రమంలో సుదీర ప్రాంతాల నుంచి అనేకమంది భక్తులు పాల్గొన్నారు.జరిగిన కార్యక్రమానికి వడిశా జానకమ్మ గోపాలరావు సింగుపురం మహాలక్ష్మి కృష్ణారావు కుటుంబ సభ్యులు నారాయణ సేవ చేసారు. జరిగిన ఆధ్యాత్మిక సేవా కార్యక్రమంలో సింగపురం లక్ష్మణరావు స్వామి బొడ్డేపల్లి అప్పలనాయుడు ప్రవచనాలు చేశారు.

శ్రీచక్రపురంలో సహస్ర లింగార్చన పూజలు

విశాలాంధ్ర-ఎచ్చర్ల : దోమాం పంచాయతీ కుంచాల కురమయ్యపేటలోని శ్రీ చక్రపురంలో శివాలయంలో 1100 శివలింగాలకు ఆదివారం కార్తీకమాసం సందర్భంగా భక్తి శ్రద్ధలతో సహస్ర లింగార్చన పూజలు నిర్వహించారు. పీఠాధిపతి తేజోమూర్తుల బాల భాస్కరశర్మ భక్తులచే శివలింగాల వద్ద పూజలు చేయించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పార్టీ కోసం పనిచేయాలి

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : జనసేనపార్టీ ప్రజల అవవసరాల కోసం పని చేస్తుందని, పార్టీ సిద్ధాంతాల మేరకు ప్రతీ ఒక్కరు నడుచుకోవాలని ఆ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ అన్నట్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు తెలిపారు. ఆదివారం శ్రీకాకుళంలో క్రియాశీలక చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న మనోహర్ సమక్షంలో నియోజకవర్గం నుండి పలువురు పార్టీ కండువాలు కప్పుకున్నారు. మున్సిపాలిటీ 1,2 ,13,17 వార్డులు, మండపల్లికి చెందిన పలువురితో పాటు సోంపేట మండలం చేపల గొల్లగండి గ్రామానికి చెందిన కర్రి నాగరాజు, తుపాకుల ఖోగేష్, ఆశి శేషా రావు, చాట్ల శేషారావు, కొనతల త్రినాథ్, కాతిల వాసు, పైల శ్రీను, అనపాన రమేష్, లండ రుక్మందర్, నీలాపు ఉపేంద్ర, కొరికాన వకీర్ జనసేనపార్టీలో చేరారు. వారిలో పలువురు అధికార వై.సి.పికి చెందిన వారు కూడా ఉన్నారు. చేరికల కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీలు తిప్పన దుర్యోధన, బైపల్లి ఈశ్వరరావు, మత్స్యకార వికాస విభాగ కార్యదర్శి నాగుల హరి బెహరా, జిల్లా , మండల నాయకులు పాల్గొన్నారు.

తులసి సహస్ర దళార్చన పూజలు

అనంతరం అన్న ప్రసాద వితరణ

విశాలాంధ్ర-ఎచ్చెర్ల : కార్తీక మాసం సందర్భంగా ఎచ్చెర్ల శ్రీనివాస ప్రార్థన మందిరంలో సహస్ర తులసీ దళార్చన కార్యక్రమం భక్తులచే వైభవంగా నిర్వహించబడింది. అనంతరం అన్న ప్రసాద వితరణ సుమారుగా 2500 మందికి నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రార్థన మందిరం వ్యవస్థాప కులు ఆదిమూలం వెంకటపతి దాసు సంతోష్ శర్మ, నాగేశ్వరరావుశర్మ తదితర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.